క్లుప్తంగా

శ్రీవారి పథకాలకు రూ.2.51 లక్షల విరాళం



దాత తిరుపతిరావుకు విరాళం బాండ్ పత్రాన్ని అందిస్తున్న ఆలయ సూపరింటెండెంట్ శ్రీను

ద్వారకాతిరుమల: శ్రీవారి పథకాలకు ఇద్దరు భక్తులు వేరువేరుగా సోమవారం రూ. 2,51,348 విరాళంగా అందజేశారు. అందులో భాగంగా నూజివీడు మండలం మీర్జాపురం గ్రామానికి చెందిన ఎం.సత్యసాయి శోభన్‌బాబు, అరుణ కుమారి దంపతులు నిత్యాన్నదాన పథకానికి రూ.1,00,116, అలాగే ఏలూరుకు చెందిన చల్లగళ్ల తిరుపతిరావు నిత్యాన్నదాన పథకానికి రూ. 1,01,116, గోసంరక్షణ పథకానికి రూ.50,116 ఆలయ కార్యాలయంలో జమచేశారు. దాతలకు ఆలయ సూపరింటెండెంట్ మద్దాల శ్రీను విరాళం బాండ్ పత్రాలను అందించారు.

వరప్రసాద్‌కు సన్మానం



ఊటుకూరి వరప్రసాద్‌ను సత్కరిస్తున్న దృశ్యం

కొయ్యలగూడెం: ఇటీవల గుర్రం జాషువా పురస్కారాన్ని పొందిన డాక్టర్ ఊటుకూరి వరప్రసాద్‌ను సోమవారం బోడిగూడెం జెడ్పీ హైస్కూల్లో సన్‌రైజ్ ల్యాబ్ ప్రొప్రైటర్ గెల్లా ప్రసాద్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. తెలుగు భాషా సాహిత్య వ్యాప్తికి కృషి చేస్తున్న వరప్రసాద్ సేవలను ఈ సందర్భంగా పలువురు కొనియాడారు. ముందుగా కేక్ కట్ చేసి విద్యార్థులకు చాక్లెట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో రాజవరం మాజీ ఎంపీటీసీ తమిర్సి బ్రహ్మయ్య, పూలపల్లి కృష్ణ బాబు, బొబ్బర కిషోర్, చిడిపి రవి, ప్రధానోపాధ్యాయులు, డేవిడ్ బ్రెనడ్, చంద్రపాల్, జి.శ్రీనివాసరావు విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే బాలరాజు పర్యటన

బుట్టాయగూడెం: పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు బుట్టాయగూడెం, జీలుగుమిల్లి మండలాల్లో మంగళవారం పర్యటించనున్నారు. ఉదయం 8:30కు బుట్టాయగూడెం మండలం అచ్చియ్యపాలెంలో జరుగుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో పాల్గొని వైద్యశిబిరాలను ప్రారంభిస్తారని పార్టీ మండల కన్వీనర్ అల్లూరి రత్నాజీరావు తెలిపారు. అలాగే ఉదయం 10 గంటలకు జీలుగుమిల్లి మండలం స్వర్ణవారిగూడెం సచివాలయ పరిధిలో ఏర్పాటు చేసిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొంటారని పార్టీ మండల కన్వీనర్ చందా ప్రసాద్ తెలిపారు. అనంతరం రైతు భరోసా కేంద్రాన్ని ప్రారంభిస్తారన్నారు. ఆయా కార్యక్రమాల్లో ప్రజలు, వైద్యాధికారులు, పార్టీ శ్రేణులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొని జయప్రదం చేయాలని వారు కోరారు.

అన్నసమారాధన

ద్వారకాతిరుమల: గణేష్ నవరాత్రి ఉత్సవాల ముగింపును పురస్కరించుకుని స్థానిక కొప్పుశెట్టి వారి వీధిలో సోమవారం భారీ అన్నసమారాధనను నిర్వహించారు. అన్నసమారాధనను శ్రీవారి దేవస్థానం ఈఓ వేండ్ర త్రినాధరావు ప్రారంభించి, పలువురు భక్తులకు స్వయంగా వడ్డించారు.

స్థల వివాదంపై పరస్పర కేసుల నమోదు

జంగారెడ్డిగూడెం: వేగవరం బజారులో స్థల వివాదం నేపథ్యంలో పరస్పర కేసులు నమోదయ్యాయని హెచ్‌సీ పీసీహెచ్ శ్రీనివాసరెడ్డి తెలిపారు. వివరాల ప్రకారం వేగవరం బజారు నందు బళ్ళ సూర్యచంద్రం, బోడా రజినిలకు స్థలం విషయమై గొడవ నడుస్తోంది. ఈ నేపథ్యంలో జెట్టి సత్యనారాయణ అనే వ్యక్తి మధ్యలో వచ్చి దాడి చేయడంతో గాయపడి స్థానిక ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నానని సూర్యచంద్రం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కాగా బోడా రజినికి చెందిన ఇంటి స్థలం వివాదం నేపథ్యంలో మూడు నెలల క్రితం సమస్యను సరి చేసి హామీ పత్రాలు రాశానని, ఆ పత్రాలు తన ఇంటి వద్ద ఉండడంతో ఈ నెల 8న బళ్ల సూర్యచంద్రం మరో ఆరుగురితో కలిసి వచ్చి దాడి చేశాడని జెట్టి సత్యనారాయణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కాగా ఇద్దరి ఫిర్యాదులపై కేసు నమోదు చేసినట్లు హెచ్‌సీ తెలిపారు.

ఘర్షణపై పరస్పర కేసులు

జంగారెడ్డిగూడెం: బంధువుల మధ్య జరిగిన ఘర్షణ నేపథ్యంలో పరస్పర కేసులు నమోదు చేసినట్లు ఏఎస్సై వై.మంగయ్య తెలిపారు. వివరాల ప్రకారం.. తన బంధువైన కర్రిపోతుల సురేష్ కర్రతో కొట్టి గాయపర్చాడని పంగిడిగూడెం గ్రామానికి చెందిన కాకుళ్ల రమేష్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కాకుళ్ల రమేష్ తనపై దాడి చేసి గాయపర్చినట్లు కర్రిపోతుల సురేష్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

దారి ఆక్రమణలు తొలగించాలి

కుకునూరు: గ్రామంలోని శ్మశానవాటికకు దారి ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని వెంకటాపురం ఎస్సీ కాలనీ గ్రామస్తులు సోమవారం కుక్కునూరు తహసీల్దార్‌ను కలిసి వినతిపత్రం అందించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దారిని కొందరు రైతులు ఆక్రమించడంతో శ్మశాన వాటికకు వెళ్లే మార్గం లేక ఎవరైనా మృతి చెందుతే వాగుల్లో దహన సంస్కారాలు చేయాల్సి వస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు సంజీవరావు పసుపులేటి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల ఇంటి ముంగిటకే నాణ్యమైన వైద్యం



ద్వారకాతిరుమల: పంగిడిగూడెంలో పౌష్టికాహారం స్టాల్స్‌ను సందర్శిస్తున్న గోపాలపురం ఎమ్మెల్యే వెంకట్రావు

ద్వారకాతిరుమల: నాణ్యమైన వైద్యాన్ని పేద ప్రజల ఇంటి ముంగిటకు చేర్చేందుకే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రవేశపెట్టినట్టు గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు తెలిపారు. మండలంలోని పంగిడిగూడెంలో సోమవారం జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఎమ్మెల్యే తలారి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన వైద్య శిబిరంలో రోగులకు అందుతున్న వైద్య సదుపాయాలపై డాక్టర్లను ఆరా తీశారు. అలాగే రోగులకు అందుతున్న సౌకర్యాలను పరిశీలించి, వైద్యులకు పలు సూచనలు, సలహాలనిచ్చారు. అనంతరం అంగన్‌వాడీలు ఏర్పాటు చేసిన పౌష్టికాహారం స్టాల్స్‌ను ఆయన సందర్శించారు. ఆ తరువాత పలువురికి జగనన్న ఆరోగ్య సురక్ష కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తలారి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదలకు నాణ్యమైన విద్య, వైద్యాన్ని అందించేందుకు అహర్నిశలు శ్రమిస్తున్నారని అన్నారు. ముఖ్యంగా ఎంతో ఖరీదైన వైద్యాన్ని పేదలకు ఉచితంగా అందించాలన్నదే జగనన్న సంకల్పమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ చిగురుపల్లి శామ్యూల్, సర్పంచ్ ప్రత్తిపాటి మహలక్ష్ముడు(యోహాను), గుమ్మడి శ్రీను, బోరుగడ్డ రాజారావు, పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు మార్గాని చిట్టియ్య, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ టి.మేరీ, కార్యకర్తలు సీహెచ్ సుభేసిని, సీహెచ్ సుమతి, పి.శైలజ, సీహెచ్ నాగలక్ష్మి సింధు, కె.నాగలక్ష్మి, సచివాలయాల మండల కన్వీనర్ భోగరాజు సాయికృష్ణ, బొండాడ వెంకన్నబాబు తదితరులున్నారు.

సీతానగరంలో...



చింతలపూడి: సీతానగరం సచివాలయం వద్ద శిబిరంలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

చింతలపూడి: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని మండల పరిషత్ చీఫ్ విప్ కలకొండ రామారావు పిలుపునిచ్చారు. మండలంలోని సీతానగరం సచివాలయం వద్ద సోమవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. రామారావు మాట్లాడుతూ పేద ప్రజలు ఆరోగ్యంగా ఉండాలన్న ఉద్దేశ్యంతో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా ఇంటిద్దకే వచ్చి వైద్యులు వైద్య సేవలు అందించే కార్యక్రమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టారని తెలిపారు. శిబిరంలో నిపుణులైన వైద్యులతో పాటు పీహెచ్‌సీ వైద్యులు గ్రామస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అనంతరం జగనన్న ఆరోగ్య సురక్ష హెల్త్ కార్డులను అందచేశారు. కార్యక్రమంలో సర్పంచ్ గాయం మల్లేశ్వరి, చింతంపల్లి సర్పంచ్ తాండ్ర రామకృష్ణారావు, మాజీ ఎంపీటీసీ తమ్మిశెట్టి శ్రీను, చందా శ్రీను సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కన్నాపురంలో...



టి.నరసాపురం: జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

కొయ్యలగూడెం: జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని కన్నాపురం గ్రామంలో సోమవారం నిర్వహించారు. మెయిన్ రోడ్ లో ఉన్న ఎంపీపీ స్కూల్లో ఏర్పాటు చేసిన ఆరోగ్య శిబిరానికి పంచాయతీ పరిధిలోని గ్రామాలతో సహా బుట్టాయిగూడెం మండలాలకు చెందిన గిరిజన గ్రామాల ప్రజలు హాజరై వైద్య, ఆరోగ్య సేవలు పొందారు. ప్రత్యేక పరీక్షలతో పాటు జనరల్ పరీక్షలు నిర్వహించి వ్యాధి నిర్ధారణ చేసుకున్న రోగులు ఔషధాలను పొందారు. సుమారు 300 మంది రోగుల వరకు వైద్య సేవలు పొందినట్లు కొయ్యలగూడెం పీహెచ్‌సీ డాక్టర్ ఎస్తేరు రాణి తెలిపారు. ఎంపీడీవో ఆర్.బేబీ శ్రీలక్ష్మి, సర్పంచ్ ఉప్పల పద్మావతి, ఉప సర్పంచ్ ఎండీ ముంతాజ్ బేగం, ఎంపీటీసీ ఎస్‌కే బాజీ, తదితరులు పాల్గొన్నారు. మంగళవారం రామానుజపురం గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించనున్నారు.

టి.నరసాపురం: ప్రజారోగ్య పరిరక్షణే జగనన్న ఆరోగ్య సురక్ష ముఖ్య ఉద్దేశ్యమని తహసీల్దార్ జేవీ సుబ్బారావు తెలిపారు. మక్కినవారిగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో వివిధ రకాల పరీక్షలు నిర్వహించి, సంబంధిత వ్యాధులకు మందులు ఉచితంగా పంపిణీ చేస్తున్నట్లు ఆయన చెప్పారు. కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి కళ్లజోళ్లు, ఆపరేషన్లు కోసం సిఫార్సు చేసినట్లు పేర్కొన్నారు. పేద కుటుంబాలకు జగనన్న ఆరోగ్య సురక్ష వరం లాంటిదన్నారు. ప్రజలు ఆరోగ్య సురక్ష కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. మండల వైద్యాధికారులు ఫణీంద్ర బాబు, ఆంజనేయులు, నాయకులు కూకలకుంట్ల గోపి, పి.ఏడుకొండలు, పంచాయతీ కార్యదర్శి లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కుకునూరు: ప్రజా ఆరోగ్యమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారని వైఎస్సార్ సీపీ మండల నాయకులు కోటగిరి నళిని ప్రవార్ పేర్కొన్నారు. సోమవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం అమరవరం సచివాలయ పరిధిలో నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య శిబిరానికి హాజరైన వారికి వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ డీఎల్ ప్రమద్వర, సచివాలయ సిబ్బంది, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

15 నుంచి దసరా మహోత్సవాలు



దసరా శరన్నవరాత్రుల కరపత్రాన్ని విడుదల చేస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: ఈ నెల 15వ తేదీ నుంచి పట్టణంలోని ఆర్యవైశ్య కళ్యాణ మండపం ఎదురుగా ఉన్న శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో దసరా మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. సోమవారం వాసవీ ఆలయంలో దసరా ఉత్సవాల కరపత్రాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ 15వ తేదీన ఆలయ మండప ప్రవేశం, విఘ్నేశ్వర పూజ, అఖండ దీపారాధన, మహాకలశ స్థాపనతో కార్యక్రమాలు ప్రారంభమవుతాయన్నారు. వాసవీ అమ్మవారు 15న బాల త్రిపుర సుందరీ దేవిగా, 16న గాయత్రీదేవి, 17న అన్నపూర్ణాదేవి, 18న మహాలక్ష్మీదేవి, 19న కాత్యాయిని దేవి, 20న మహాసరస్వతి, 21న లలితా త్రిపుర సుందరీదేవిగా, 22న దుర్గాదేవిగా, 23న మహిషాసుర మర్దినిగా, సాయంత్రం రాజరాజేశ్వరిదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిస్తారన్నారు. 25వ తేదీన మహాన్నసమారాధన, అనంతరం గ్రామోత్సవం నిర్వహిస్తామని తెలిపారు. ప్రతిరోజు ఉదయం, సాయంత్రం అమ్మవారికి ప్రత్యేక కుంకుమ పూజలు నిర్వహిస్తామన్నారు.

ప్రజాప్రతినిధులతో కలిసి ప్రయాణం



ప్రజాప్రతినిధులతో బస్సులో ప్రయాణిస్తున్న గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు



విజయవాడకు తరలివెళుతున్న గోపాలపురం నియోజకవర్గం ప్రజాప్రతినిధులు

బస్సులో ప్రయాణించిన ఎమ్మెల్యే తలారి

ద్వారకాతిరుమల: గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు నియోజకవర్గ ప్రజాప్రతినిధులతో కలిసి సరదాగా ఆర్టీసీ బస్సులో ప్రయాణించారు. విజయవాడ ఇందిరాగాంధీ స్టేడియంలో ఏర్పాటు చేసిన విస్తృత స్థాయి సమావేశానికి హాజరయ్యేందుకు నియోజకవర్గంలోని ప్రజాప్రతినిధులు సోమవారం ఉదయం సమాయత్తమయ్యారు. వారందరిని ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఆర్టీసీ బస్సులో ఎమ్మెల్యే తలారి దగ్గరుండి తీసుకెళ్లారు. తన కారులో కాకుండా ప్రజాప్రతినిధులతో కలసి బస్సులో ఎమ్మెల్యే ప్రయాణించడంతో అందరూ ఆశ్చర్యానికి గురయ్యారు. తమ నాయకుడు సాదాసీదాగా తమతో కలసి బస్సులో ప్రయాణించడం ఆనందాన్ని కలిగించిందని ప్రజాప్రతినిధులు పేర్కొన్నారు.

వైఎస్సార్‌సీపీ ప్రతినిధుల సభకు తరలివెళ్లిన నేతలు



ప్రతినిధుల సదస్సులో పాల్గొన్న నేతలు

బుట్టాయగూడెం: విజయవాడ ఇందిరా గాంధీ స్టేడియంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన వైఎస్సార్ సీపీ ప్రతినిధుల సదస్సుకు బుట్టాయగూడెం మండలం నుంచి భారీ ఎత్తున పార్టీ నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు తరలివెళ్లారు. పార్టీ మండల కన్వీనర్ అల్లూరి రత్నాజీరావు, జిల్లా కార్యదర్శి సయ్యద్ బాజీ, పార్టీ సీనియర్ నాయకులు ఆరేటి సత్యనారాయణ, జెడ్పీటీసీ మొడియం రామతులసి, ఎంపీపీ కారం శాంతి, వైస్ ఎంపీపీలు, కుక్కల వరలక్ష్మి, గగ్గులోతు మోహన్‌రావు, సచివాలయాల కన్వీనర్లు తెల్లం సింహాచలంతోపాటు పలువురు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా వైనాట్ 175 ప్లకార్డ్స్‌'నను పట్టుకుని జై జగన్ నినాదాలు చేశారు.

జీలుగుమిల్లి మండలం నుంచి....

జీలుగుమిల్లి మండలం నుంచి కూడా వైఎస్సార్‌సీపీ ప్రతినిధుల సదస్సుకు పార్టీ నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు తరలివెళ్లారు. పార్టీ మండల కన్వీనర్ చందా ప్రసాద్, జెడ్పీటీసీ మల్లం వసంతరావు, సొసైటీ అధ్యక్షుడు బోదా శ్రీనివాసరెడ్డి, ఎంపీపీ కోర్సా పోచమ్మ, జేసీఎస్ కన్వీనర్ వనమా రామకృష్ణ, వైస్ ఎంపీపీ సోమగాని శ్రీనివాసరావు, పార్టీ సీనియర్ నాయకులు ఉప్పల రాంపండు, తదితరులు తరలివెళ్లారు.

కోటిలింగాల మహాయజ్ఞంలో జంగారెడ్డిగూడెం వాసులు



శివలింగాల తయారీలో పాల్గొన్న మహిళలు

జంగారెడ్డిగూడెం: కోటిలింగాల తయారీ మహాయజ్ఞంలో జంగారెడ్డిగూడెం వాసులు భాగస్వాములయ్యారు. కార్తీకమాసంలో వారణాసిలో పార్థీవ శివలింగాలకు అభిషేకం చేయడం ఎంతో పుణ్యం. అందరూ వారణాసి వెళ్లి ఈ కార్యక్రమాన్ని చేయడం సాధ్యపడనందున హైదరాబాద్‌కు చెందిన విజయానంద గురు సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షులు తంగిరాల రామచంద్రసాయి సామూహిక శివలింగాల తయారీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. కోటిలింగాలను తయారుచేసి వాటిని వారణాసి తీసుకువెళ్లి అభిషేక అర్చన చేయనున్నారు. ఈ క్రమంలో జంగారెడ్డిగూడెం నుంచి 3 లక్షల పార్థీవ లింగాలను తయారు చేయనున్నారు. ఈ కార్యక్రమం స్థానిక ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో ఈ నెల 1వ తేదీ నుంచి నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు చిట్లూరి రమణరావు గుప్త, నాగలత దంపతులు పేర్కొన్నారు. వారణాసి నుంచి ఆవుపేడ, ఆవునెయ్యి, వారణాసి మట్టిని కలిపిన మిశ్రమాన్ని శివలింగాల తయారీకి వినియోగిస్తుండగా, విజయానంద గురు సేవా సమితి జంగారెడ్డిగూడెంకు 55 బస్తాల పిండిని ఇచ్చినట్లు తెలిపారు. ఇప్పటివరకు 50 వేల విగ్రహాలను తయారు చేశామని రమణరావు గుప్త దంపతులు తెలిపారు. మట్టి శివలింగాలను తయారు చేసే అవకాశం లభించడం సంతోషంగా ఉందని కార్యక్రమంలో పాల్గొన్న మహిళలు, భక్తులు తెలిపారు.

పారిశుధ్య సిబ్బంది నియామకానికి చర్యలు తీసుకోవాలి



మంత్రి ఆదిమూలపు సురేష్‌ను మర్యాదపూర్వకంగా కలుసుకున్న మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం మున్సిపాలిటీల్లో పారిశుధ్య నియామకానికి చర్యలు తీసుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి మున్సిపల్ మంత్రి ఆదిమూలపు సురేష్‌ను కోరారు. సోమవారం విజయవాడలోని మంత్రి కార్యాలయంలో మంత్రి సురేష్‌ను చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి, వైస్ చైర్మన్ కంచర్ల వాసవీరత్నం, వైఎస్సార్ సీపీ పట్టణాధ్యక్షుడు చిటికల అచ్యుతరామయ్యతో కలిసి మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా బత్తిన లక్ష్మి మాట్లాడుతూ పట్టణంలో శానిటేషన్ సిబ్బంది కొరత వల్ల పారిశుధ్య సమస్యలు ఏర్పడుతున్నాయని, కావున పారిశుధ్య సిబ్బంది నియామకాలకు అనుమతి ఇవ్వాలని కోరారు. ఉమ్మడి గోదావరి జిల్లాల వైఎస్సార్ సీపీ కో ఆర్డినేటర్, ప్యానెల్ స్పీకర్ పెద్దిరెడ్డి మిధున్‌రెడ్డి సహకారంతో రూ.2 కోట్లతో బీటీ నిర్మాణానికి అనుమతులు మంజూరు చేయాలని మంత్రిని ఆమె కోరారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందించినట్లు లక్ష్మి పేర్కొన్నారు.

ప్రణాళికతోనే నూరుశాతం ఉత్తీర్ణత



విద్యార్థులకు సూచనలు ఇస్తున్న డీఈవో

కామవరపుకోట: పదో తరగతి విద్యార్థులను ప్రణాళిక బద్ధంగా చదివిస్తే నూటికి నూరుశాతం ఉత్తీర్ణత సాధించవచ్చని జిల్లా విద్యాశాఖ అధికారి పి.శ్యాం సుందర్ అన్నారు. సోమవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ప్రభుత్వం మెనూ ప్రకారం ఆహారం అందించాలని సిబ్బందికి సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు 10వ తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించి ప్రణాళిక బద్ధంగా చదివించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ప్రభుత్వం అనేక కార్యక్రమాలను నిర్వహిస్తుందని, వాటిని విజయవంతం చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఈ సందర్భంగా మిషన్ జీఈఆర్, 10వ తరగతి విద్యార్థుల ప్రత్యేక తరగతులను పరిశీలించి పలు సూచనలు ఇచ్చారు. ఆయనతోపాటు ఎంఈవో డి.సుబ్బారావు, హెచ్‌ఎం ఎం.భ్రమరాంబ సుందరి, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ పండు జగదీష్ పాల్గొన్నారు.

విద్యార్థుల ప్రతిభ



కలెక్టర్ నుంచి సర్టిఫికెట్‌ను అందుకుంటున్న విద్యార్థులు

జంగారెడ్డిగూడెం: నేషనల్ యూత్ ఫెస్ట్ 2023లో భాగంగా నాకో, ఏపీ సాక్స్, డాప్ క్యూల సంయుక్త ఆధ్వర్యంలో ఏలూరు డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో నిర్వహించిన జిల్లా స్థాయి కాంపిటీషన్‌లో జంగారెడ్డిగూడెం జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ చూపారు. విద్యార్థులు గమిడి విశేష్‌కృష్ణ, మల్లవరపు శ్రీప్రియ ఈ పోటీల్లో తృతీయ స్థానం సాధించినట్లు హెచ్‌ఎం కేఎస్‌వీ లోవకుమారి తెలిపారు. సోమవారం ఏలూరు కలెక్టర్ సమావేశ మందిరంలో జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్, జిల్లా విద్యాశాఖ అధికారి టి.శ్యాంసుందర్ చేతుల మీదుగా నగదు బహుమతులు ఒక్కొక్కరికి రూ. 1500, సర్టిఫికెట్‌లను అందుకున్నారని చెప్పారు. విద్యార్థులను, తర్ఫీదునిచ్చిన గణిత ఉపాధ్యాయులు బీవీఎస్ ఆర్‌కే ప్రసాద్‌ను హెచ్‌ఎం లోవ కుమారితో పాటు తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ పచ్చిపాల మృత్యుంజయరాజు, సిబ్బంది అభినందించారు.

డిజిటల్ అసిస్టెంట్ ఆకస్మిక మృతి



బి.సుధీర్

టి.నరసాపురం: టి.నరసాపురం 1వ సచివాలయ డిజిటల్ అసిస్టెంట్ బి.సుధీర్ అనారోగ్యంతో సోమవారం ఆకస్మికంగా మృతిచెందారు. ఆయన విధి నిర్వహణలో భాగంగా మక్కినవారిగూడెంలో జగనన్న సురక్ష కార్యక్రమంలో బాధ్యతలు నిర్వహించేందుకు మోటార్‌సైకిల్‌పై వెళుతూ మార్గంలో అస్వస్థతకు గురయ్యారు. కంప్యూటర్ ఆపరేటర్ రవి సమీపంలోని యర్రగుంటపల్లి ప్రభుత్వాసుపత్రికి సుధీర్‌ను మోటార్‌సైకిల్‌పై తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సుధీర్ మృతిచెందాడు. సుధీర్‌కు భార్య, ఏడాదిన్నర పాప ఉన్నారు.

హైస్కూల్ ఆటస్థలం ఆక్రమణల తొలగింపు

టి.నరసాపురం: మక్కినవారిగూడెం జెడ్పీ ఉన్నత పాఠశాల ఆటస్థలం ఆక్రమణలపై తహసీల్దార్ జేవీ సుబ్బారావు స్పందించారు. ఆటస్థలం ఆక్రమణలపై హెచ్‌ఎం ఎల్.వెంకటేశ్వరరావు సోమవారం తహసీల్దార్‌కు ఫిర్యాదు చేసిన నేపథ్యంలో ఆయన వెంటనే స్పందించి ఆక్రమణల తొలగింపునకు చర్యలు తీసకున్నారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ పాఠశాల ఆటస్థలాన్ని కొందరు స్థానికులు ఆక్రమించి పశువులను కట్టేస్తుండడం వల్ల విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని, ఇదే విషయంపై హెచ్‌ఎం వెంకటేశ్వరరావు పలుమార్లు ఆక్రమణదారులను హెచ్చరించినా వారి తీరు మారలేదన్నారు. దీంతో హెచ్‌ఎం తనకు ఫిర్యాదు చేయడంతో, రెవెన్యూ, పోలీసు సిబ్బందితో కలసి ఆక్రమణల తొలగింపుకు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఎస్సై మాధవ రెడ్డి, వీఆర్‌వో జిల్లా సుభాష్ చంద్రబోస్, కె.గోపి, పి.ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

'బూటకపు ఉద్యమాలతో పార్టీకి సంబంధం లేదు'

జంగారెడ్డిగూడెం: సీపీఐఎంఎల్ పేరుతో డబ్బులు వసూలు చేస్తున్నారని, అట్టి వారితో పార్టీకి ఎటువంటి సంబంధం లేదని సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి తలారి ప్రకాష్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కొయ్యలగూడెం మండలం కన్నాపురంలో ఇళ్లస్థలాల పోరాటం అంటూ జొన్నకూటి వెంకటేశ్వరరావు, మడకం రామన్న పార్టీ పేరు చెప్పి ప్రజల నుంచి వేలాది రూపాయలు వసూలు చేస్తున్నారన్నారు. బూటకపు ఉద్యమాలు చేస్తున్న వీరికి పార్టీకి ఎటువంటి సంబంధం లేదన్నారు. సెటిల్‌మెంట్‌లు, భూ దందాలకు పాల్పడుతున్న కారణంగా వీరిని పార్టీ నుంచి తొలగించామని, వీరు మరో ఇద్దరితో కలిసి అమయాక ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. దీంతో పార్టీకి ఎటువంటి సంబంధం లేదని పేర్కొన్నారు.

ఓటు హక్కుపై అవగాహన



విద్యార్థి ఎన్నికలను పరిశీలిస్తున్న తహసీల్దార్

కొయ్యలగూడెం: మాక్ పోలింగ్ వలన హైస్కూల్ స్థాయినుంచి విద్యార్థులకు ఓటు హక్కు విధానంపై అవగాహన కలుగుతుందని తహసీల్దార్ పాసం నాగమణి పేర్కొన్నారు. సోమవారం సరిపల్లి సమీపంలోని ఎంవీఆర్ విద్యా సంస్థలో ప్రిన్సిపాల్ రవి మహేష్ ఆధ్వర్యంలో విద్యార్థిస్థాయి ఎన్నికలు నిర్వహించారు. స్కూల్ ఎస్‌పీఎల్, డిప్యూటీ ఎస్‌పీఎల్‌లను ఎన్నుకున్నారు. ఈ ఎన్నికల శిబిరాన్ని తహసీల్దార్ ప్రజాప్రతినిధులతో కలిసి సందర్శించారు. ఓటు హక్కు గురించి, ఓటు కోసం దరఖాస్తు చేసుకునే విధానం, దానికి కావలసిన అర్హతలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. వైస్ ఎంపీపీ తుమ్మలపల్లి గంగరాజు, ఎంపీటీసీ బండి గంగారత్నం, ఆర్‌ఐ మణి దివ్య పాల్గొన్నారు.

ఏఎన్‌ఎంల నిరసన



పీహెచ్‌సీ వద్ద ఆందోళన చేస్తున్న ఏఎన్‌ఎంలు

లింగపాలెం: లింగపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారిణి సంధ్యారాణిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం ఏఎన్‌ఎమ్‌లు ధర్నా చేశారు. వైద్యాధికారిణి సంధ్యారాణి వేధింపులు తట్టుకోలేక ఏఎన్‌ఎం చోడగిరి శర్వాణి ఆదివారం నిద్రమాత్రలు మింగి ఆత్మహత్యాయత్నంకు పాల్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆమె చింతలపూడి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతుందని వారు పేర్కొన్నారు.

ఏఎన్‌ఎంకు పరామర్శ

చింతలపూడి: ఏఎన్‌ఎం శ్రావణిని జిల్లా సచివాలయ ఉద్యోగుల సంఘం నాయకులు సోమవారం పరామర్శించారు. బాధితురాలికి తమ సంఘం అండగా ఉంటుందని ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా సచివాలయ ఉద్యోగుల సంఘం రీజనల్ సెక్రటరీ జీవీ శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమంలో మండల సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

స్పందనలో 16 అర్జీలు

జంగారెడ్డిగూడెం: స్థానిక ఆర్డీవో కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఆర్డీవో ఝాన్సీరాణి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. సోమవారం నాటి స్పందనలో మొత్తం 16 అర్జీలు వచ్చాయని, ఎక్కువగా భూ సంబంధిత సమస్యలపై వినతులు వచ్చినట్లు ఆర్డీవో తెలిపారు. సదరు అర్జీలను సంబంధిత అధికారులకు ఎండార్స్ చేసినట్లు చెప్పారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

కామవరపుకోట: సాఫ్ట్‌బాల్, బేస్‌బాల్ రాష్ట్రస్థాయి పోటీలకు తడికలపూడి విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు అంగులూరి సర్వేశ్వరరావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇటీవల పెదవేగిలోని ఏపీఎస్ డబ్ల్యూ ఆర్ పాఠశాలలో జరిగిన జిల్లాస్థాయి సాఫ్ట్‌బాల్, బేస్‌బాల్ పోటీలలో తమ పాఠశాలకు చెందిన వెన్నెల వాసు, తోమ్మడి మణికంఠ, నాగ శివ సాయి విశేష ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. వీరు త్వరలో జరగబోవు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని వివరించారు. శిక్షణ ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయులు మారగాని నరసింహారాజుని, విద్యార్థులను, జెడ్పీటీసీ కడిమి రమేష్, సర్పంచ్ కొత్తపల్లి రజిని, పాఠశాల విద్యాకమిటీ చైర్మన్ నాగరాజు, గ్రామస్తులు అభినందించారు.